# ప్రతీకారము



రచన : శ్రీమతి రేగులపాటి విజయలక్ష్మి

దగ్గరికి వేసివున్న తలుపులను తోసుకొని వచ్చింది పద్మ.

శాలిని కుర్చీలో చిన్నబోయి కూర్చుని వున్నది.

"ఏమే, శాలినీ! అలా ఉన్నావు—షాపుకెళ్ళి చీరలు కొనుక్కుందాము అని ప్రోగ్రాం వేసింది నీవే కదా; కదలకుండ కూర్చుని ఉన్నావు? ఏమయింది నీకు? ఏ సమస్య వచ్చి పడింది?"

పద్మ ఎన్ని మాటలన్నా శాలిని మాట్లాడటము లేదు. ఏదో పోగొట్టుకున్నట్లు ఉన్న ఆ చూపుల్లో మార్పు లేదు.

"శాలినీ!" అని పిలుస్తూ దగ్గరికి వచ్చి చేతితో కదిపింది.

శాలినిలో కొంచెము చలనము కన్పించింది.

"శరత్ ఆరోగ్యముగా వున్నాడా?" అని అడిగింది పద్మ.

శరత్, కాంతి ఇరువురూ శాలిని సంతానము.

"బాగానె వున్నాడు" అంది శాలిని.

"మరి ఇంకేమి బాధ వచ్చింది ఇంత అర్జంటుగా, నిన్న బాగానే ఉన్నావు కదా. మీ ఆయనతో నీకు ఎలాంటి గొడవలూ లేవంటావ్? మరి ఇంకేమి బాధ వచ్చింది నీకు?"

"చాలా కుటుంబములలో భార్యా భర్తలు ఏదో ఒకదాని కొరకు తగవులాడుకుంటూనే వుంటారు. ఎనిమిది సంవత్సరాల నుండి చూస్తున్నాను. మీ ఇరువురి మధ్య తగవు వచ్చి నీవు మూతి ముడుచుకొని కూర్చుని వుండగా నేను చూడలేదు బాబూ!"

"మీ కుటుంబాన్ని చూస్తే చాలా ముచ్చట వేస్తూ వుంది, మీకు తగినట్టు పిల్లలు వున్నారు. చాలా కుటుంబాలలో పిల్లలు ఇది కావాలి, అది కావాలి అని వేధించుక తింటారు. కాని, మీ పిల్లలు అలా మిమ్మల్ని వేధించినట్లు కన్పించరు. మీ పిల్లలను ఇంత క్రమశిక్షణతో పెంచిన గొప్పతనం నీదా? మీ ఆయనదా?" అని ఏకధాటిన మాట్లాడుతుంది పద్మ.

పిల్లల విషయము వచ్చేసరికి ఏదో మాట్లాడాలని నోరు తెరువబోతోంది శాలిని.

రాఘవరావుగారు యింట్లోకి వచ్చారు. "ఏమిటి—స్నేహితురాలిద్దరూ ఏదో చర్చించుకుంటున్నారు. నేనూ వినవచ్చునా?" అన్నారు రాఘవరావుగారు.

"ఏమీ లేదు అన్నయ్యగారూ! శాలిని ఏదో పోగొట్టుకున్న దానిలా చిన్నబోయి కూర్చుని వున్నది.

"నిన్న నేమో ఎంతో ఉల్లాసముగా రేపు రెండు గంటలకు రావే పద్మా! బజారువెళ్ళి రెండు చీరెలు తెచ్చుకుందాము" అని అన్నది.

ఈ రోజు కదలకుండా కూర్చుని వున్నది.

"మీరిద్దరూ దేనికొరకైనా తగవులాడుకున్నారా?" అని రాఘవరావును అడిగింది పద్మ.

"మీ స్నేహితురాలు అలా చెప్పిందా?" అన్నాడు రాఘవ.

"అది అలా చెప్పుతుందా? మా యిద్దరికి ఏ గొడవలు ఉండవు అంటుంది. నిజముగా మీరు ఒక్కసారి అయినా పోట్లాడుకోరా? నిజము చెప్పవే అని దాని గెడ్డం పట్టుకుని అడిగాను. అది చెప్పితేనా?" అన్నది పద్మ.

పద్మ మాట్లాడిన తీరుకు శాలినికి నవ్వొచ్చింది. పగలబడి నవ్వసాగింది శాలిని.

శాలినిని చూచి రాఘవరావు నవ్వాడు.

ఆ యిద్దర్నీ చూచి పద్మ నవ్వింది. ఆ జంటను చూస్తే పద్మకు ఆశ్చర్యం. ఏ గొడవా లేనట్లుగా వుంటారు వీళ్ళు అని ఆశ్చర్య పడుతుంది. సంతోష పడుతుంది. తన భర్త రామం యింట్లో ఉన్నంతసేపు ఏదో చిరుబుర్రు లాడుతూనే వుంటాడు. ఆ చిర్రుబుర్రు చూస్తే చిరెత్తుకొస్తుంది తనకు. ఇద్దరిమధ్యా తగాదా! రోజుల తరబడి మౌనంగా వుండటం మళ్ళీ మామూలే.

"నిజముగా మీ యిద్దరిమధ్యా తగాదాలే రావా?" అని అడిగింది పద్మ రాఘవరావును.

"తగాదా అంటే ఒక్కరిపై ఒకరు పెద్దగా అరుచుకోవడమా?" అన్నాడు రాఘవ.

"శాలినికి చదువూ సంస్కారమూ వుంది. నా సంపాదన ఎంతో ఆమెకు తెలుసు. అందువలన నా శక్తికి మించిన కోరికలు ఆమె కోరదు. పిల్లలిద్దరూ ఆణిముత్యముల వంటివారు. చెప్పింది అర్థం చేసుకొనే నేర్పు వాళ్ళలో వున్నది. నిజముగా ఇది ఆమె పెంపకము వల్లనే సాధ్యపడుతుంది. శాలినివలన నేను చాలా సుఖముగా వున్నాను" అన్నారు ఆనంద పారవశ్యముతో రాఘవరావుగారు.

"శాలినికి తోడబుట్టినవారు చాలామంది వున్నారు. 'మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన' అన్న సామెత వుంది. నీ అచ్చట ముచ్చట వాళ్ళు తీర్చలేరు అని మా నాన్నగారు మా పెళ్ళికి అభ్యంతరము చెప్పారు కాని, నేను వినలేదు. నేను తీసుకున్న నిర్ణయము సరియైనదే!' అన్నారు రాఘవరావుగారు.

"మరి, శాలిని ఎందుకలా చిన్నబోయి కూర్చున్నది?" ప్రశ్నించింది పద్మ.

ఇంతలో బయటనుండి శరత్, శాంతి వచ్చారు.

"ఆంటీ, అమ్మ ఎందుకు బాధ పడుతుందో నేను చెప్పనా?" అంది శాంతి.

"నేను చెప్పుతాను" అన్నాడు శరత్.

"తొందరగా చెప్పండర్రా" అంది పద్మ అలస్యం భరించలేనట్లు.

"మా ఎదురుగ్గా వున్న యింట్లో నలినక్క చనిపోయింది. నిన్న సాయంత్రము తెలిసింది. అందుకే అమ్మ బాధ పడుతుంది" అంది శాంతి.

"పాపం, నలినక్క చాలా మంచిది. నా కెన్నో కథలు చెప్పేది" అన్నాడు శరత్.

"ఏమిటీ. నలిని చనిపోయిందా? ఆరు నెలల క్రితము కదూ పెళ్ళి చేసారు?"

"అవును. రెండు లక్షల కట్నము మరియు 50 వేలు లాంఛనాలు యిచ్చి పెళ్ళి చేశారు. పెళ్ళికి డబ్బు సరిపోకపోతే మా దగ్గర పది వేలు అప్పుగా తీసుకున్నారు" అంది శాలిని.

"ఆ కట్నము సరిపోలేదని అత్త, ఆడపడుచులు వేధించుక తినటము, ఆమె భర్త పట్టించుకోక పోవడము. ఆ వేధింపుమాటలు చెప్పుకుంటూ నళిని నా దగ్గర చాలా ఏడ్చేది."

అప్పుడు నేనెంతో ధైర్యం చెప్పాను. నీకు భరించలేని బాధ అన్పించినప్పుడు యిక్కడికి వచ్చేయమని...

"కాని, నళినికి నా మాటలు రుచించలేదు. నా తరువాత యిద్దరు చెల్లెండ్రు వున్నారు. పెళ్ళిఅయిన దానికి మళ్ళీ వాళ్ళ గుండెలమీద కుంపటిలా ఇక్కడికి వస్తే తన తల్లిదండ్రులు బాధ పడుతారంది" నళిని అని చెప్పింది శాలిని.

ఈ మధ్య నళిని భర్త స్కూటర్ కొని తెచ్చుకోమని వేధించడం మొదలు పెట్టాడట. ఆ స్కూటర్ మీద నళినిని అటు ఇటు తోలుక పోతాడట. నళిని తల్లిదండ్రులకు చెప్పలేక ఒక లెటర్ వ్రాసింది

తండ్రికి. అది పేరేలోపల అక్కడ కిరోసిన్ పోసుకొని మరణించింది,

ప్రమాదవశాత్తు అంటుకొని మరణించినది అని ఇక్కడికి మనిషిని తోలించారు.

"ఈ సమస్యను తట్టుకొని నిలిచే మనోధైర్యాన్ని నూరిపోయలేక పోయాను అని బాధ పడుతున్నాను పద్మా!" అంది శాలిని.

వెంటనే పరంధామయ్యగారు, సావిత్రమ్మగారు వెళ్ళారు.

"అల్లునిమీద పోలీసు కంప్లైంట్ యిచ్చారా?" అంది పద్మ.

"నిజము తెలిసినప్పటికీ వాళ్ళ కల్లబొల్లిమాటలు నమ్మినట్లుగానే వున్నారు వీళ్లు. పోలీసు కాంప్లైంట్ యివ్వవద్దని, ఇద్దరికి అనవసర ఖర్చు అని వాళ్ళ రెండవ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానని వాళ్ళ అల్లుడు బ్రతిమిలాడాడట.

బపితావారి...
ప్రత్యేక తయారింపులు
* సిఫాన్ * మాస్త్రి
* రావ్‌టూ * సెలెక్షన్
* వట్ సెలక్షన్

Phone : 22909

BAPITA KNITTERS
Lakshmi Nagar, Tirupur - 638 602.

రెండవ అమ్మాయిని నళిని భర్తకు యివ్వాలని ఉన్నట్లు తెలయువచ్చు చున్నది. అందుకే బాధ పడుచున్నాను."

"ఏమిటి పిన్ని! కేసు పెట్టలేక పోయారా?" అని నేను అడిగితే—

పోయిన బిడ్డ ఎలాగూ తిరిగిరాదు. అంత డబ్బు

With best compliments from :

**SRI VADIVU TEXTILES.,**

STAG BRAND

—: Manufacturers of :—

ART SILK CARPETS, COTTON CORPETS &
FAST COLOUR BEDSHEETS

P. B. No. 59, Behind Royal Theatre
B H A V A N I - 638 301.

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లు చాలా ప్రసిద్ధమైనది.
వాడిన ప్రతి వారూ పదే పదే ఆర్డరిస్తున్నారు.
మా ప్రతినిధిగా వుండేవాళ్ళు మంచి లాభము పొందుతున్నారు.
ఏజెంట్లు లేని ఊళ్ళలో ఏజెంట్లు కావలెను.
(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

వాళ్ళకిచ్చాము. అది ఎలా వస్తుంది? మాకు యీ అమ్మాయి ఎదిగి వున్నది, అందరి రాత ఒక్కలాగ వుంటుందా? దీని అదృష్టము మంచిగ వుంటే అతడే మారుతాడు" అంది సావిత్రమ్మ.

'నళిని చచ్చింది' అన్న బాధ కన్నా ఆమె తల్లి తండ్రి అన్న మాటలు నన్ను మరింత కుంగతీశాయి అంది శాలిని.

"బిడ్డ పోయింది' అన్న బాధ లేదా వాళ్ళకి?" అంది పద్మ.

'బిడ్డ పోయింది' అన్న బాధ చాలా వున్నది... కాని వరకట్న సమస్యలవల్ల వాకు పరిస్థితిని చక్క దిద్దుకుంటున్నారు అంది శాలిని.

శాలిని మాటలు విని ఉప్పు లేని కూరలాగ వాళ్ళ ఆలోచనలు చప్పగా వున్నాయి అని నివ్వెరబోయింది పద్మ,

ఇంతలో నళిని చెల్లెలు జలజ అక్కడికొచ్చింది. పద్మ అడగనే అడిగింది.

మీ అక్కను చంపిన వాళ్ళ యింటికి కోడలిగా పోవడానికి నీవెలా వొప్పుకుంటున్నావు?"

జలజ కళ్ళు అగ్నిహోత్రాల వల్ల ప్రజ్వరిల్లు తున్నాయి" ఆవేశముతో అంది.

పరిస్థితులకు తల ఒగ్గికాదు అంటీ! వాళ్ళ మీద పగ తీర్చుకోవడానికి. అక్క అమాయకురాలు కాబట్టి చనిపోయింది. నేను వాళ్ళపై ప్రతీకారము తీర్చు కుంటాను. అందుకే ఈ పెళ్ళికి ఒప్పుకున్నాను.

జలజ నిర్ణయము విని శాలిని విస్తుపోయింది.




"కథాంజలి" దీపావళి సంచికకు మా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు !



**కావలెను**

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లు సిల్కు జంకాళాలు, నూలు జంకాళాలు, హాలు జంకాళాలు, డైనింగ్‌హాలు జంకాళాలు ప్రసిద్ధి చెందినవి. వాటిని ప్రతివారూ మెచ్చుకుంటున్నారు. వీటికి ప్రతినిధిగా నున్నవారు మంచి లాభము పొందుచున్నారు.

ఎల్. ఐ. సి. ఏజంటు, రిటైరయిన గవర్నమెంటు పనివారి నుంచి, వారు మంచి లాభం పొందుటకు ధరఖాస్తులు కోరబడుచున్నాము.

——: తయారించువారు :——

# Sri Maduraiveeran Traders

Mfrs. of : Art Silk, Cotton Carpets & Bedsheets,

BEHIND ROYAL THEATRE, BHAVANI - 638 301.